పేర్లు కూడా అప్‌డేట్ చేయరా?

- జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోన్‌లో నేమ్ బోర్డులను పట్టించుకోని అధికారులు
- ఏ విభాగంలో ఏ అధికారి ఉన్నారో తెలియని పరిస్థితి


కూకట్‌పల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల పట్టిక



మూసాపేట్ సర్కిల్


కూకట్‌పల్లి సర్కిల్

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వ కార్యాలయం చూసినా అందులో పనిచేసిన అధికారుల జాబితాతో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న అధికారి ఎవరు? అనేది ఉండాలి. జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోన్ పరిధిలో ఐఏఎస్ అధికారి ఉన్నా ఆయా సర్కిళ్ల బోర్డుల గురించి పట్టించుకునేనాథుడే కరువయ్యారు. మూసాపేట్ సర్కిల్-23లో 2023, కూకట్‌పల్లి సర్కిల్-24లో 2020 వరకు మాత్రమే అధికారుల జాబితా ఉంది. ప్రస్తుతం ఏఏ అధికారులు పని చేశారు... పని చేస్తున్నారని బోర్డు ఏర్పాటు చేయాలి. ఏ విభాగంలో ఏ అధికారి పనిచేస్తున్నారో అక్కడి సిబ్బందిని అడిగితే తప్ప తెలియడం లేదు. జంట సర్కిళ్ల పరిధిలో నేమ్ బోర్డులు అప్‌డేట్ కాకుండా దుమ్ము పట్టి అంధవికారంగా మారాయి. నేమ్ బోర్డులను పట్టించుకునే వారేలేరని కొందరు అక్కడి సిబ్బంది చెబుతున్నారు. మెయిన్ ఎంట్రన్స్‌లో ఉన్న బోర్డులే ఇలా ఉంటే ఆయా డిపార్ట్‌మెంట్స్‌లో పరిస్థితి ఇంకా ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

పీవోటీ చట్టాన్ని రద్దు చేయాలి


మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూములకు పీవోటీ 1977 చట్టాని పూర్తిగా రద్దుచేసి సంపూర్ణ హక్కులు కల్పించాలని తెలంగాణ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లను కలిసి విన్నవించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పెట్టి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎర్రోళ్ల శివయ్య, ఉపాధ్యక్షులు రుద్రారం శంకర్, బింగి రాములు, కోహిర్ లాజర్, ఈశాన్ సింగ్, పోచారం, సంయుక్త కార్యదర్శి ఎస్ఎస్ డేవిడ్ తదితరులు ఉన్నారు.

సూర్యనారాయణ శర్మకు డాక్టరేట్


డాక్టరేట్ పట్టా అందుకుంటున్న పెండ్యాల సూర్యనారాయణ శర్మ

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీకి చెందిన జ్యోతిష్యుడు పెండ్యాల సూర్య నారాయణ శర్మ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. బెంగళూర్‌కు చెందిన ఎస్‌వీవీ యూనివర్సిటీలో మెడికల్ ఆస్ట్రాలజీలో పీహెచ్‌డీ చేశారు. ఈ మేరకు ఈనెల 11న తిరుపతి మహతి ఆడిటోరియంలో యూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టాతో పాటు జ్యోతిష్య ఆచార్య పురస్కారం అందుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి


నీటి సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

హైదర్‌నగర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని పలు కాలనీల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీ సమస్యలు పరిష్కరించాలని గురువారం బీజేవైఎం కార్యకర్తలు జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడ కమలాకర్ ఆధ్వర్యంలో సీనియర్ నేత నరేందర్, కేశవ రావు, కుమార్ యాదవ్‌తో కలిసి జలమండలి డీజీఎం నాగప్రియ, మేనేజర్ ఝాన్సీతో భేటీ అయ్యారు. ఆల్విన్‌కాల నీ డివిజన్‌లోని ఈస్ట్ సాయి నగర్, వెస్ట్ సాయి నగర్, ఫేజ్-టు, ఎల్లమ్మబండ, పీజేఆర్‌నగర్, మహంకాళినగర్ కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్లు లీకేజీకి, కలుషిత నీరు సరఫరా అవుతున్నాయని కమలాకర్ విన్నవించారు. దీంతో స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారని, ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడంలేద ని ఆక్షేపించారు. ఈ భేటీలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా నేత రమేష్, సురేష్, అమర్నాథ్, రేవంత్ ఉన్నారు.

వరద కాల్వ పనుల పరిశీలన


ఉషా ముళ్లపూడి రోడ్డులో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

హైదర్‌నగర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి రోడ్డులో కాల్వ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గురువారం పరిశీలించారు. రూ. 2కోట్లతో చేపడుతున్న వరద నీటి కాల్వ, సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు కార్పొరేటర్ సూచించారు. శివరాజ్ గౌడ్, గుడ్ల శ్రీనివాస్, పోశెట్టి గౌడ్, ఏ.ఈ.శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, గుత్తేదారు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారితే.. తల్లి రూపం మారుతుందా?


తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డుబోయినపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారితే తల్లి రూపం మారుతుందా అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వ తీరును ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ విమర్శించారు. గురువారం జయశంకర్‌కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారి మనోభావాలు దెబ్బకొట్టేలా ప్రభుత్వం ఒంటెద్దు పోకడను అవలంభిస్తోందన్నారు. ఇకనుంచైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మనోభావాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రిటైల్ కూరగాయల మార్కెట్ ఛైర్మన్ సత్యనారాయణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి మేకల హరినాథ్, మైనారిటీ అధ్యక్షుడు మెహరాజ్ కాలనీ సభ్యులు ఫిరోజ్, చందు, యాదగిరి, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, ఐలయ్య, వాణీ పాల్గొన్నారు.

అద్దె బకాయిలు చెల్లించాలి


ధర్నా చౌక్‌కు తరలి వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

బాలానగర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల 11 నెలల అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పరిష్కారానికి గురువారం చేపట్టిన చలో హైదరాబాద్(ఇందిరాపార్కు ధర్నాచౌక్)కు కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలోని హస్మత్‌పేట, మూసాపేట, ఎర్రగడ్డ, పర్వత్‌నగర్ హైదరాబాద్ సెక్టార్ల అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయక కార్యదర్శి బిలాపురం రాజశేఖర్, అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ నాయకురాలు వసంతలక్ష్మి మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ టీచర్లకు రూ.14,000, ఆయాలకు హెల్పర్లకు రూ.12,000 ఇస్తామని హామీ ఇచ్చిందని, 11 నెలలు గడిచినా ఇంతవరకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. 11నెలల అద్దె బకాయిలు, కూరగాయల బిల్లులు కూడా చెల్లించలేదని వాపోయారు. అంగన్‌వాడీ టీచర్లపై అధికారుల వేదింపులు ఎక్కువవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చేపట్టిన ధర్నాతోనైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి 11 నెలల అద్దె, పెండింగ్‌లో ఉన్న కూరగాయల బకాయిలను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల యూనియన్ నాయకులు టీచర్లు సారిక, శ్వేత, రజిత, హేమల, రమ, ఉమ సంగీత, శశికళ. శారద, పద్మశాలిని, కృపారాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్


సీఐ నర్సింహరాజు

బాలానగర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి 13వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌లో ఈనెల 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాలానగర్ సీఐ టి.నర్సింహరాజు సూచించారు. డ్రంకెన్ డ్రైవ్, పెట్టి కేసులు, మైనర్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్ సరిగా లేక జప్తు చేసిన కేసులు, రాంగ్ సైడ్ డ్రైవింగ్ ఎక్కువ చలాన్లు పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవచ్చని సీఐ తెలిపారు. వీటితో పాటు పాత కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి పంపకాలు, భార్యాభర్తల పంచాయితీలు, బ్యాంక్ రికవరీలు, చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ఆక్సిడెంట్లు, పేకాట, ఎక్సైజ్‌కు సంబంధించిన దొంగతనాలు ఇతర కేసుల ను పరిష్కరించుకోవచ్చునని సీఐ తెలియజేశారు. పంతాలకు పోయి ఇబ్బందుల పాలు కాకుండా రాజీ మార్గం ద్వారా అన్ని సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని ఆయన వివరించారు. ఈ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి ఏమైనా సందేహాలు ఉంటే తనను గానీ, పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభాగాన్ని కలిసి తగాదాలపై రాజీ కుదుర్చుకొని సమస్యను పరిష్కరించుకోవచ్చని సీఐ స్పష్టం చేశారు.

నేడు కాంగ్రెస్ సమావేశం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

బాలానగర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మూసాపేట రాయల్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాల విజయోత్సవాలు ముగించుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సమాశానికి సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ డివిజన్ శ్రీహరినగర్‌లో నూతనంగా చేపట్టిన సీసీరోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ పగుడాల శిరీషబాబురావు పరిశీలించారు. రోడ్డును సమయం ప్రకారం నీటితో క్యూరింగ్ చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. త్వరలోనే నూతనంగా వేసిన రోడ్డు వినియోగంలోకి తెస్తామని స్థానికులకు కార్పొరేటర్ హామి ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీహరినగర్ అధ్యక్షులు జయరాజ్, భాస్కర్‌రావు, సుశీల్, శారద తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను రెచ్చగొట్టే కామెంట్లు సరికాదు'

ఫతేనగర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యో తి): తెలంగాణ ద్రోహులకు తెలంగాణ, తెలంగాణ తల్లి విలువ తెలియదని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఏ బ్లాక్ ఇన్‌చార్జి, టీజేసీ కన్వీనర్ పట్లోళ్ల నాగిరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. బుధవారం తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం చేసి కాంగ్రెస్ తల్లి వద్దు, తెలంగాణ తల్లి ముద్దు అంటూ సోషల్ మీడియాలో చేసిన వాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణ తల్లి గురించి తెలియాలంటే 1969, 2007 నాటి విగ్రహాలను చూస్తే తెలంగాణ తల్లి ఎలా ఉంటుందో బోధపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలను రెచ్చగొట్టేలా కామెంట్లు, కార్యక్రమాలు చేయడం సరికాదన్నారు.

వివేక్ వెంకటస్వామికి ఆహ్వానం


చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామితో పట్లోళ్ల నాగిరెడ్డి తదితరులు

ఫతేనగర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎమ్మెల్యే డా. వివేక్ వెంటకస్వామిని ఫతేనగర్ భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ కూకట్‌పల్లి ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. భరత్‌నగర్ హరిహరా క్షేత్రంలో నిర్వహించే పూజలకు హాజరుకావాలని ఆయనను ఆహ్వానించారు. సీనియర్ నాయకుడు కొండాల్‌రెడ్డి, అశోక్ ముదిరాజ్, తదితరులు నాగిరెడ్డి వెంట ఉన్నారు.

అయ్యప్ప పడిపూజ

ఓల్డుబోయినపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్ వల్లభ్‌నగర్‌లోని శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన అయ్యప్ప పడిపూజకు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ హాజరై పత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్‌గౌడ్, పవన్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠ

ఓల్డుబోయినపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): భవానీనగర్ దుర్గా భవానీ మాతా దేవాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం ఉదయం 6 గంటల నుంచి గణపతి పూజలతో మొదలయ్యాయి. శుక్రవారం రుద్రహోమం, శనివారం గణపతి పూజ, పుణ్యాహవచనం, శిలాన్యాసం, యంత్ర ప్రతిష్ఠ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

యువకులు సేవాగుణం అలవర్చుకోవాలి


పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న బండి రమేష్

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): యువకులు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బాలాజీనగర్‌లో ఎస్ఎఫ్ఏ చిరునీలం, ఆశా స్థాపించిన చిరునవ్వు ఫౌండేషన్ లోగోను గురువారం బండి రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 40మంది జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులకు భోజనం పెట్టి, చీరలు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆజాద్ ఫోర్స్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్, చిరునవ్వు ఫౌండేషన్ ఛైర్మన్ ఆశా, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సాధు ప్రతాప్‌రెడ్డి, తూము సంతోష్, శివ చౌదరి, రమణ, హరిప్రసాద్, గోపీ తదితరులు పాల్గొన్నారు.

18న ఓయూలో కృతజ్ఞత సభ

- నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ మానవతారాయ్

తార్నాక, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 18న ఓయూలో కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నామని నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ కోటూరి మానవతారాయ్ తెలిపారు. తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ రూం నంబర్ 57లో 'కాంగ్రెస్ ప్రభుత్వం-రేవంత్‌రెడ్డి ఏడాది పాలన' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను గురువారం నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ. 5వేలు, తృతీయ బహుమతి రూ. 3వేలు ఈ నెల 18న కృతజ్ఞత సభలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు డా. వరంగల్ రవి, రెడ్డి శ్రీను, బోనాల నగేష్, భీమ్‌రావ్ నాయక్, పెరుమాళ్ళ గుట్టయ్య గౌడ్, బైరు నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గీతం పూర్వ విద్యార్థికి అరుదైన గౌరవం

- ప్రపంచ సదస్సులో వక్తగా, న్యాయనిర్ణేతగా అవకాశం
- గ్లోబల్ ఐకాన్ అవార్డుతో సత్కారం


గ్లోబల్ ఐకాన్ అవార్డుతో అనూజ్ సురావ్

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ పూర్వ విద్యార్థి, ప్రస్తుతం అమెజాన్ రోబోటిక్స్‌లో సిస్టమ్స్ డెవలప్ మెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అనూజ్ సురావ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు అమెరికా, కేంబ్రిడ్జ్‌లోని హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ పరిశోధనా సదస్సు (గ్లోబల్ రీసెర్చ్ కాన్ఫరెన్స్ 2024లో వక్తగా, న్యాయనిర్ణేతగా)లో పాల్గొన్నారు. బెంగళూరుకు చెందిన గ్లోబల్ ఎకనామిక్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ హరికృష్ణ మారం నేతృత్వంలో జరిగిన ఈ సదస్సులో రోబోటిక్స్ క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ రంగాలకు అనూజ్ చేసిన సేవలను గుర్తిస్తూ 'గ్లోబల్ ఐకాన్ అవార్డు'తో సత్కరించారు. అమెరికా అంకుర సంస్థల నిపుణుడు, వక్త, మార్గదర్శి, వ్యవస్థాపకుడు బారన్ అలెక్స్టైరన్ చేతుల మీదుగా ఈసత్కారాన్ని అందుకోవడం విశేషం. 'అడాప్టివ్ ఇంటర్ ఫేస్‌తో ఏడబ్ల్యూఎస్ క్లౌడ్, కృత్రిమ మేధ ఆధారిత ఆటోమేటెడ్ రోబోటిక్ సిస్టమ్‌పై అనూజ్ సంచలనాత్మక పరిశోధనా పత్రం సమర్పించారు. తన పరిశోధనాంశాలను అక్కడ ప్రదర్శించడం, వినూత్న పరిశోధనా పత్రాల ఎంపికలో న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అత్యాధునిక కృత్రిమ మేధస్సు అడాప్టివ్ ఇంటర్ ఫేస్‌ల ఏకీకరణను ప్రస్ఫుటించేలా అనూజ్ అధునాతన రోబోటిక్ సిస్టమ్‌ను చూసేందుకు సదస్సుకు హాజరైన వారికి వీలుకల్పించారు. సంకల్ప్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సామాజిక సేవ, అనాథలను ఆదుకోవడంతో పాటు గీతం విద్యార్థిగా ప్రఖ్యాత ఐటీసీ సంస్థ నుంచి పర్యావరణ పరిరక్షణకు గాను నేషనల్ గ్రీన్ లీడర్ అవార్డును అనూజ్ అందుకున్నారు. తర్వాత న్యూయార్క్ విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఎంఎస్ చేసి, అమెరికాలోనే స్థిరపడ్డారు. ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో గుర్తింపు తెచ్చుకున్న అనూజ్ గీతంలోని ఉన్నత విద్య, విలువల నాణ్యతకు నిదర్శనంగా నిలిచారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కిలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.15, వంకాయ రూ.23, బెండకాయ రూ.35, పచ్చి మిర్చి రూ.28, బజ్జి మిర్చి రూ.21, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.38, క్యాబేజీ రూ.16, బీన్స్ రూ.48, క్యారెట్ రూ.40, గోబి పువ్వు రూ.30, దొండకాయ రూ.26, చిక్కుడు కాయ రూ.40, గోరు చిక్కుడు రూ.35, బీట్‌రూట్ రూ.37, క్యాప్సికం రూ.50, ఆలుగడ్డ రూ.35, కీర రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.22, కంద రూ.55, ఉల్లిపొరక రూ.35, ఉల్లిగడ్డ రూ.49, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.37, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.30, గుమ్మడికాయ రూ.40, నిమ్మకాయలు రూ.30-40, మునగ కాయలు రూ.18-20, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.400, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.40, కరివేపాకు రూ.100, పర్వల్ రూ.45, పల్లికాయ రూ.60, లోబా రూ.30, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు శుక్రవారం ఉదయం 9.30 వరకు అందుబాటులో ఉంటాయి.

కుష్టువ్యాధి కేంద్రానికి దుస్తులు అందించిన ఎస్‌బీఐ



శివానంద కేంద్రానికి దుస్తులు, వస్తువులను అందజేస్తున్న ఎస్‌బీఐ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని శివానంద కుష్టువ్యాధి కేంద్రానికి ఉపయోగపడే పాత దుస్తులను, వస్తువులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు జనరల్ మేనేజర్ జీ.వి.శాస్త్రి మాట్లాడుతూ.. జనహితమే తమ బ్యాంకు అభిమతమని, ఆపన్నులను ఆదుకోవడానికి ఎస్బీఐ ఎల్లప్పుడూ ముందువరసలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ బాలాజీ, ఏజీఎంలు, చీఫ్ మేనేజర్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి


డీసీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న గాయత్రీ నగర్ వీఎస్ఆర్ అపార్ట్‌మెంటు

అల్లాపూర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గాయత్రీ నగర్‌లోని ఓ అపార్టుమెంట్ వాసులకు ఇబ్బంది కలిగేలా నిర్మాణం చేపట్టారని, మున్సిపల్ అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనంపై మూసాపేట్ సర్కిల్ డీసీ వంశీకృష్ణకు ఫిర్యాదు చేశారు. గాయత్రీనగర్ వీఎస్ఆర్ అపార్టుమెంట్‌లోని నివాసితులు తమ అపార్టుమెంటు పక్క స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపట్టడం జరిగిందని, తమ అపార్టుమెంట్ లోపలికి రావడం జరిగిందని ఆరోపించారు. ఈ విషయమై గత ఫిబ్రవరిలో హై-కోర్టులో రిట్ దాఖలు చేశామని తెలిపిన ఫిర్యాదు దారులు, తగు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీని కోర్టు ఆదేశించిందని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ కూడా అప్పటి స్థితిలోని అక్రమ నిర్మాణాన్ని తొలగించాలంటూ సదరు నిర్మాణ దారుడికి నోటీసు ఇచ్చిందని, స్థానిక నాయకుల పలుకుబడితో నిర్మాణదారుడు వాటిని బేఖాతరు చేశాడని ఫిర్యాదులో పేర్కొన్న ఫిర్యాదుదారు ఆయా అక్రమ నిర్మాణం కారణంగా అపార్టుమెంట్ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నామని, ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని డీసీను కోరారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ విజేతగా జేఎన్‌టీయూ జట్టు


వర్సిటీ క్రీడాకారులతో వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్ తదితరులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఇంటర్ ఇంజనీరింగ్ హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్‌లో జేఎన్‌టీయూ పురుషుల జట్టు విజేతగా నిలిచింది. అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన టోర్నమెంట్‌లో పాల్గొని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న జేఎన్‌టీయూ టీమ్‌ను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి గురువారం అభినందించారు. అలాగే, శ్రీనిధి ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఖోఖో పోటీల్లోనూ ప్రథమ బహుమతి సాధించిన క్రీడాకారులను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొని జేఎన్‌టీయూకు మరిన్ని పతకాలు సాధించాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. యూనివర్సిటీ తరఫున క్రీడాకారులకు అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జపాన్ హబ్‌తో ఓక్సన్ వర్సిటీ ఎంఓయూ

- ఓక్సన్ యూనివర్సిటీలో జపనీస్ లాంగ్వేజ్ సెంటర్ ఏర్పాటు


ఎంఓయూ పత్రాలను మార్చుకుంటున్న ఓక్సన్, జపాన్ హబ్ ప్రతినిధులు


హైదరాబాద్ సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఓక్సన్ విశ్వవిద్యాలయంతో జపాన్ హబ్, ఇండో బాక్స్ సంస్థలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇరుదేశాల్లోని సాంస్కృతిక అధ్యయనంతో పాటు విద్యార్థులకు కెరీర్ డెవలప్‌మెంట్‌కు ఈ త్రైపాక్షిక ఎంఓయూ దోహద పడుతుందని ఆయా సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. ఓక్సన్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రౌల్ వి రోడ్రిగ్స్ మాట్లాడుతూ.. ఎంఓయూ మేరకు తమ విశ్వవిద్యాలయంలో జపనీస్ భాషా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఈ కేంద్రం ద్వారా విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సాంస్కృతిక అవగాహనను పెంపొందించడానికి కోర్సులను అందిస్తున్నట్టు వెల్లడించారు. ఈభాగస్వామ్యంతో ఉమ్మడి పరిశోధన, ప్రాజెక్టులు, భాగస్వామ్యాలకు అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని పేర్కొన్నారు. జపాన్‌లో విద్యార్థుల మార్పిడి, ఇంటర్న్‌షిప్‌లు, ఉపాధి అవకాశాలు, కల్చరల్ లెర్నింగ్ అనుభవాలు సులువవుతాయన్నారు. జపనీస్ మేనేజ్‌మెంట్ పద్ధతులపై దృష్టిపెట్టడం వలన ఇక్కడి విద్యార్థుల్లో నైపుణ్యాలు మరింత మెరుగవుతాయన్నారు. విద్యాపరమైన సహకారాలతో పాటు సాంకేతిక పురోగతిని కూడా గణనీయంగా పెంచుతుందన్నారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర సముద్ర అభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి ప్రొ.హర్ష్ కె గుప్తా

తార్నాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కేంద్ర సముద్ర అభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొ.హర్ష్ కె గుప్తా అన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిసిస్ట్స్(ఏఈజీ) గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని 'జియో ఎక్స్‌ప్లోరేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రీషియస్ మెటల్స్' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు. ఈ సదస్సును గురువారం హర్ష్ కె.గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై భౌగోళిక అన్వేషణ గణనీయమైన ప్రభావం చూపుతుందన్నారు. ఆర్థిక వృద్ధిలో కీలకమైన లోహాలు, విలువైన ఖనిజాలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఏఈజీ ఉపాధ్యక్షుడు, జియోఫిజిక్స్ విభాగాధిపతి ప్రొ. వీరయ్య, ఫ్యాకల్టీ ఆఫ్ డీన్ ప్రొ. కరుణాసాగర్, ఓఎన్జీసీ బేసిన్ మేనేజర్ కరువణ్ణన్, జీఎస్ఐ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రామమూర్తి, చంద్రశేఖర్, డాక్టర్ బి.నరసింహారావు, బాబు, జవహర్ తదితరులు పాల్గొన్నారు.



ఓయూ ఆర్ట్స్ కాలేజీలో వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

18న ఓయూలో కృతజ్ఞత సభ

● నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మానవతారాయ్

తార్నాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ నెల 18న ఓయూలో కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నామని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ తెలిపారు. తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ రూం నంబర్ 57లో 'కాంగ్రెస్ ప్రభుత్వం - రేవంత్‌రెడ్డి ఏడాది పాలన' అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను గురువారం నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేల నగదు బహుమతులను ఈ నెల 18న కృతజ్ఞత సభలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు డా.వరంగల్ రవి, రెడ్డిశ్రీను, బోనాల నగేష్, భీమ్‌రావ్ నాయక్, పెరుమాళ్ల గుట్టయ్య గౌడ్, భైరు నాగరాజుగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర కురుమ విద్యార్థి సంఘం నాయకులు కమలాకర్, డాక్టర్ ఏలేందర్ తదితరులు

రేపు కురుమల ఆత్మగౌరవ భవనం ప్రారంభం

తార్నాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14న కోకాపేట్‌లో దొడ్డి కొమరయ్య కురుమల ఆత్మగౌరవ భవనం ప్రారంభించనున్నారు. ఈ మేరకు గురువారం తెలంగాణ రాష్ట్ర కురుమ విద్యార్థి సంఘం నాయకులు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కురుమ విద్యార్థి సంఘం నాయకులు కమలాకర్, డాక్టర్ ఏలేందర్ మాట్లాడారు. ఈ నెల 14న కోకాపేట్‌లో ప్రారంభించనున్న దొడ్డి కొమరయ్య కురుమల ఆత్మగౌరవ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధిరామయ్య, హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. దొడ్డి కొమరయ్య ఉద్యమ స్ఫూర్తితో కురుమ సామాజికవర్గానికి చెందిన ప్రతి ఒక్కరూ భవన ప్రారంభోత్సవానికి హాజరై కురుమల ఐక్యతను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కురుమ విద్యార్థి సంఘం నాయకులు డా. బర్ల మహేందర్, కురువ మహేష్, జక్కుల అనిల్, కృష్ణ, అశోక్, మధు పాల్గొన్నారు.



నాడు రోడ్డు స్థలాన్ని ఆక్రమించి, ఏర్పాటు చేసిన డబ్బా



నేడు రోడ్డులో ఉన్న డబ్బాను తొలగించిన స్థలం ఇదే

రోడ్డుపై డబ్బా తొలగింపు

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు విజయసింహా లే-అవుట్‌లోని రోడ్డు స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి, వ్యాపారం నిర్వహిస్తున్నాడు. దీంతో అధికారులకు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై వివిధ పత్రికల్లో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు గురువారం డబ్బాను తొలగించారు. దాదాపు 500గజాల రోడ్డు స్థలాన్ని ఆక్రమించడంతో 2024 మే 27న అధికారులకు ఫిర్యాదు చేశారు. డబ్బాను తొలగించడంతో కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప మాల విద్యార్థికి స్కూల్‌లోకి నో ఎంట్రీ

బీజేపీ, ఏబీవీపీ, అయ్యప్ప మాలధారుల ఆందోళన

పేట్ బషీరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాల ధరించి స్కూల్‌కు వెళ్లిన విద్యార్థినిని యాజమాన్యం లోపలికి రానీయలేదు. ఈ సంఘటన వాట్సాప్, ఫేస్‌బుక్‌లో చక్కర్లు కొట్టింది. ఈ విషయాన్ని తెలుసుకున్న అయ్యప్ప భక్తులు జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్ ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్ ముందు గురువారం ఆందోళనచేపట్టారు. ముందస్తుగానే పాఠశాల యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు గేటు ముందు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయ్యప్ప భక్తులుసదరు విద్యార్థికి యాజమాన్యం క్షమాపణ చెప్పాలని ఆందోళన చేశారు. సీఐ విజయవర్ధన్ సంఘటనా స్థలానికి చేరుకుని యాజమాన్యాన్ని, ప్రిన్సిపాల్‌ను గేటుబయటకు పిలిపించారు. ఇరువర్గాలకు సీఐ సర్దిచెప్పడం, యాజమాన్యం వారు క్షమాపణ చెప్పి, ఓ లెటర్ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

భయాందోళనలో ప్రజలు, వాహనదారులు



చంద్రానగర్‌లో పద్మావతి కిరాణషాపు సమీపంలో వంగిన స్తంభం



టీవీఆర్ స్కూల్ ఎదురు మూలమలుపులో వంగిన స్తంభం



చింతల్‌లోని ఇంటి నంబర్ 5-422 పక్కన తీగలపై వేలాడుతున్న స్తంభం

కుత్బుల్లాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలను ప్రజలకు ఇళ్లకు విద్యుత్‌ను సరఫరా చేయడంతోపాటు వీధుల్లో లైట్లను అమర్చడానికి ఏర్పాటు చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో స్తంభాల వల్ల ప్రజలు ఇబ్బందుల పడుతున్నారు. దశాబ్దాల క్రితం నాటిన స్తంభాలు వంగిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కేవలం విద్యుత్ బిల్లుల వసూళ్ల పైనే సంబంధిత అధికారులు దృష్టిపెట్టారని, సమస్యలను కూడా పరిష్కరిస్తే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలోని చింతల్, చంద్రానగర్‌లో కాలనీ ఆవిర్భవించినప్పుడు విద్యుత్ స్తంభాలను నాటించారు. దశాబ్దాలు గడిచినా పాడైన స్తంభాలను మార్చకుండా వాటితోనే విద్యుత్ సరఫరా చేస్తున్నారు విద్యుత్ అధికారులు. అయితే కొన్ని ప్రాంతాల్లో స్తంభాలు పాతవి కావడంతో వంగిపోయాయి. కేవలం తీగల సహకారంతోనే నిల్చున్నాయి.

గాలులు వీస్తే కూలిపోయే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చంద్రానగర్ టీవీఆర్ మోడల్ స్కూల్ ఎదురు మూలమలుపు వద్ద, పద్మావతి కిరాణా జనరల్ స్టోర్, ఇంటి నెంబర్ 5-422 వద్ద విద్యుత్ స్తంభాలు పూర్తిగా వంగిపోయి తీగలపై వేలాడుతూ దర్శనమిస్తున్నాయి. అవి ఎప్పుడు కూలుతాయోనని స్థానిక ప్రజలు బిక్కుబిక్కుమంటూ నివాసం ఉంటున్నారు. వాహనదారులైతే రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులైనా స్పందించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్తవి ఏర్పాటు చేసేందుకు కృషి

ఈ విషయంపై విద్యుత్ ఏఈ రాధాకిషన్ రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. అలా ఉన్నట్లు మా దృష్టికి రాలేదన్నారు. ఒకవేళ అలాంటివి ఏమైనా ఉంటే కొత్తవి ఏర్పాటు చేయించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసుకుంటామని ఏఈ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

బీసీలకు 8 మంత్రి పదవులు కేటాయించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

బర్కత్‌పుర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే చేపట్టనున్న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించాలని, బీసీలకు 8 మంత్రి పదవులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో కేవలం ఇద్దరు బీసీలు మంత్రులుగా కొనసాగుతున్నారని, 55 శాతం జనాభా ఉన్న బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మంత్రివర్గంలో రెడ్లకు, వెలమలకు మాత్రమే న్యాయం జరిగిందన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అగ్రవర్ణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలు తిరుగుబాటు చేసి గుణపాఠం చెప్పారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా అదే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. గౌడ కులస్తులకు చెందాల్సిన ఎక్సైజ్ శాఖను వెలమ కులానికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత రాహుల్‌గాంధీకి లేఖ రాస్తామన్నారు. బీసీల మంచితనాన్ని బలహీనంగా భావిస్తే రాజకీయ సమాధి చేస్తామని హెచ్చరించారు. మంత్రివర్గ విస్తరణలో బీసీలకు అన్యాయం జరిగితే సహించబోమని, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు కుందారం గణేశ్‌చారి, బాలగౌని బాల్‌రాజ్ గౌడ్, విక్రమ్‌గౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, ఆయిలి వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్ రేపు

రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి



రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 14న రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇదివరకు కోర్టు ముందుకు రాని కేసులు కానీ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులను కానీ రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునే వేదిక ఈ లోక్‌అదాలత్ అని చెప్పారు. లోక్ అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న సివిల్‌కేసు లోక్ అదాలత్‌కు పంపబడి, ఆ తర్వాత పరిష్కరించబడినట్లయితే వాస్తవానికి కోర్టులో చెల్లించిన కోర్టు రుసుము కూడా కక్షిదారులకు తిరిగి చెల్లించబడుతుందన్నారు. లోక్‌అదాలత్‌లో కేసు పరిష్కరించుకుంటే ఇరు పక్షాలు గెలిచినట్లేనన్నారు. ఈ లోక్‌అదాలత్‌ల ద్వారా సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందని చెప్పారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, చిట్‌ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు ఇతర రాజీకి వీలున్న కేసులు సులభంగా పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. రాజీమార్గమే రాజమార్గమని ఆమె అన్నారు.

జనవరి 27న లక్ష డప్పులు.. వెయ్యి గొంతులతో దండోరా

ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



కళాకారులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఖైరతాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ సాధించే దిశగా తుది ఘట్టంగా జనవరి 27న హైదరాబాద్‌లో లక్ష డప్పులు, వెయ్యి మంది కళాకారుల గొంతులతో దండోరా ప్రదర్శన, సభ ఉంటుందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రకటించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ కళాకారులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం 9 మంది కళాకారులను గుర్తించి వారికి కోటి రూపాయల నగదు, తామ్ర పత్రం, 300 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్టు ప్రకటించడం సంతోకరమే అయినా .. వారిలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు లేకపోవడం తమను వివక్షకు గురిచేయడమేనని అన్నారు. అందెశ్రీని కొందరు మాదిగ అని ప్రచారం చేస్తున్నారని, అయితే, తాను విశ్వనరుడనని ఆయన పేర్కొన్నారని, మాదిగనని ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. కళాకారుల ఎంపిక విషయంపై ప్రభుత్వం పునఃపరిశీలించి మాదిగ కళాకారులను గుర్తించాలని కోరారు. తెలంగాణ ప్రముఖుల్లో తెలంగాణ కోసం త్యాగం చేసిన వారిని విస్మరించారని, శిల్పి యాదగిరిరావును శాసన మండలికి పంపాలని డిమాండ్ చేశారు. కళాకారులు, ప్రముఖుల్లో మహిళలకు తగు ప్రాధాన్యమివ్వాలని, తెలంగాణ ఉద్యమాన్ని చెన్నారెడ్డి అనంతరం నడిపించిన టీఎన్ సదాలక్ష్మితో పాటు చాకలి ఐలమ్మ, కేశవరావు జాదవ్, విమలక్కను ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. ఎస్సీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న మాలలు సమాజంలో ఒంటరయ్యారన్నారు. డిసెంబరు 27 నుంచి అన్ని జిల్లాల్లో రథయాత్రలు నిర్వహించి దండోరా సభకు లక్ష డప్పులతో మాదిగలు వచ్చేలా చేస్తామన్నారు. ఈ ప్రదర్శన, సభకు మాదిగ కళాకారులు ఏపూరి సోమన్న అధ్యక్షత వహిస్తారన్నారు.

బహుజనుల తెలంగాణ తల్లిని ప్రతిష్ఠిస్తాం..

తెలంగాణ తల్లులుగా కేసీఆర్, రేవంత్‌రెడ్డి పెట్టిన విగ్రహాలను తాము అంగీకరించబోమని, తాము అధికారంలోకి వస్తే చాకలి ఐలమ్మ రూపంలో ఉండే బహుజనుల తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకుంటామని మందకృష్ణ మాదిగ అన్నారు. సమావేశంలో మాదిగ కళాకారులు ఏపూరి సోమన్న, ఎస్ఐ అశోక్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, కళాకారులు గిద్దె రాంనర్సయ్య, భరత్, మల్లెపాక అనిల్, గజ్జల అశోక్, డప్పు రమేష్ పాల్గొన్నారు.

వీడని 'హత్యా'చారం కేసు మిస్టరీ

● హంతకులను పట్టుకోవడానికి పోలీసుల తీవ్రప్రయత్నాలు ● ఇంకా లభించని మహిళ వివరాలు

జీడిమెట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల్ ప్రధాన రహదారి పక్కన బుధవారం తెల్లవారుజామున అత్యాచారం తర్వాత హత్యకు గురైన మహిళ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. ఈ కేసు జీడిమెట్ల పోలీసులకు ఒక సవాల్‌గా మారింది. బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్, ఏసీపీ హన్మంతరావు పర్యవేక్షణలో జీడిమెట్ల పోలీసులు, ఎస్ఓటీ, సీసీఎస్ పోలీసులు తీవ్రస్థాయిలో గాలిస్తున్నారు. గతంలో గాజులరామారం ప్రాంతంలో ఉన్న ఈమహిళ దాదాపు 3నెలలుగా చింతల్ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ రోడ్డుపక్కనే ఉన్న దుకాణాల వద్ద రాత్రిపూట నిద్రపోతుంది. ఉన్న ఇద్దరు పిల్లలను హాస్టల్‌లో చేర్పించినట్లు తెలుస్తుంది. అసలు ఈ మహిళ ఏ జిల్లాకు చెందినది? ఈమె భర్త, కుటుంబ సభ్యులు ఉన్నారా లేదా? ఉంటే ఎందుకు ఈమెను వదిలేశారు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగిన ముందు రోజు మంగళవారం రాత్రి 10 గంటలకు ఓ వ్యక్తి మహిళను బైక్‌పై తీసుకెళ్లి తిరిగి చింతల్‌లో దింపినట్టు తెలుస్తుంది. అయితే రాత్రంతా ఈ ప్రాంతంలో వీధిదీపాలు వెలగకపోవడం, అంధకారం అలుముకోవడంతో బైక్ నెంబర్ కనిపించడం లేదని తెలుస్తుంది. ఈ బైక్ గాజులరామారం బాలాజీ లేఅవుట్ వైపు వెళ్లినట్టుగా పోలీసులు గుర్తించారు. అదేవిధంగా ఈ మహిళా చింతల్ కల్లుకాంపౌండ్ వద్ద కూడా తరచూ కనిపించేదని పోలీసుల దర్యాప్తులో తేలింది. కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. చింతల్‌లోని పలు దుకాణాలు, చిన్నచిన్న షాపుల వారిని కూడా స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఈమెను పథకం ప్రకారం అత్యాచారం చేసి హత్యచేశారా లేదా, ఏదైనా విషయంలో ఘర్షణ పడి రాయితో తలపై కొట్టి హత్యచేశారా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదు. కేవలం చేతిపై పచ్చబొట్టు ఉంది. ఇటీవల గుండుచేయించుకుంది. వీటి ఆధారంగా పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసును పోలీసులు సవాల్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాంగ్‌రూట్‌లో వచ్చిన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై మోతిలాల్

రాంగ్‌రూట్ వాహనదారులకు జరిమానా

కుత్బుల్లాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వాహనదారులు నిబంధనలు పాటించడంలేదు. కొందరు రాంగ్ రూట్‌లో వెళ్లడం, హెల్మెట్ ధరించకపోవడం, త్రిబుల్ రైడింగ్‌లో వెళ్తున్నారు. ఈవిషయంపై గురు వారం "మా దారి అడ్డదారి.. ఎవరూ ఆపలేరు" అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్‌సీఐ శ్రీనివాస్ స్పందించారు. చింతల్ నుంచి కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం వైపు వెళ్లే వాహనదారుల రాకపోకలకు అడ్డుకట్ట వేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్సై మోతిలాల్, సిబ్బంది హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద వాహనదారులను ఆపి జరిమానాలు విధించారు. పట్టుబడిన వారందరికి కౌన్సిలింగ్ ఇచ్చి ప్రమాదాల నివారణ కోసం పలు సూచనలు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.



మరమ్మతులు చేపపట్టిన మ్యాన్‌హోల్

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మురుగు నీటి కట్టడికి చర్యలు తీసుకోవాలని 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని అస్‌బెస్టాస్ కమాన్ సమీపంలో రహదారిపై వర్షపు నీరులా మురుగు నీరు ప్రవహిస్తోందని, దీంతో వచ్చిపోయే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని కథనం వచ్చింది. దీంతో అధికారులు స్పందించి సిబ్బందితో మ్యాన్‌హోల్ నుంచి చెత్తా, చెదారాన్ని తీయించి, మరమ్మతులు చేశారు. దీంతో స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

నోబుల్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలి

కొంపల్లి కమిషనర్‌కు వినతి

పేట్ బషీరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్‌లోని నోబుల్ కాలనీలో మురుగునీటి పైప్‌లైన్‌ను మార్చాలని, ఎన్‌సీఎల్ నుంచి ఫాక్స్ సాగర్ వైపు ఓపెన్, క్లోజ్ డ్రైనేజీ నిర్మించాలని, కాలనీ రహదారిపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, రహదారికి మరమ్మతులు చేయాలని, ఎన్‌సీఎల్ నుంచి నోబుల్ వరకు రోడ్డు ఆక్రమణలను తొలగించాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి కాలనీ అసోసియేషన్ సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్షాలు అధికంగా కురిసినప్పుడు పైనుంచి వచ్చే మురుగునీరు, వర్షపు నీరు వచ్చి కాలనీలో చేరడమే కాకుండా ఇళ్లలోకి డ్రైనేజీ పైప్‌ల ద్వారా పొంగుతున్నాయని తెలిపారు. కాలనీలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరంగా ఉందని, కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ల వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని, పార్కు అభివృద్ధికి వీధి కుక్కలను నియంత్రించాలని, కాలనీలో రోడ్లకు ఇరువైపులా వీధిదీపాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను ఆహ్వానిస్తున్న దళిత నాయకులు

జనవరి 6న భారత రాజ్యాంగ సభ

షాపూర్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని జనవరి 6వ తేదీన జరిగే రాజ్యాంగ సభకు రావలని గురువారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో దళిత నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల పెద్దలు డాక్టర్ అవిజే జేమ్స్, బూదాల అమర్‌బాబు, సామ్రాట్, జేజే.రత్నం, ఎం.అంజన్న పాల్గొన్నారు.



క్షత్రియ కల్చర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, అధ్యక్షులు

క్షత్రియ కల్చర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొంపల్లిలోని క్షత్రియ కల్చర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొత్తూరి శివాజీరాజు, ప్రధానకార్యదర్శిగా దండు వరహాల రాజు ఉపాధ్యక్షుడిగా భూపతిరాజు చిరంజీవి, కోశాధికారిగా సాగరాజు భానుకుమార్, సంయుక్త కార్యదర్శిగా హరిగోపాల్‌రాజు, సభ్యులుగా సుధీర్, నాగరాజును నియమించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కల్చర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.వర్మ రుద్రరాజు, నూతన అధ్యక్షుడు శివాజీరాజ్ పాల్గొన్నారు.

వృద్ధుడిని రోడ్డు దాటించిన ట్రాఫిక్ వలంటీర్

కుత్బుల్లాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితో పాటు మానవత్వాన్ని చాటుతున్నారు. గురువారం తెల్లవారుజామున చింతల్ ప్రధాన రహదారి హ్యాపీ చిల్డ్రన్స్ హాస్పత్రి సమీపంలో ఓ వృద్ధ దివ్యాంగుడు రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడుతున్నాడు. ఇది గమనించిన జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్న మురళీమోహన్ అతడిని రోడ్డు దాటించి మానవత్వం చాటుకున్నాడు.



వృద్ధ వికలాంగుడిని రోడ్డు దాటిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ వలంటీర్ మురళీమోహన్


సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

సీసీ రోడ్ల పనులు వేగవంతం చేయాలి

గచ్చిబౌలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలని, నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా చూడాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో గల నానక్‌రాంగూడలో రూ.59 లక్షలలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు, నేతాజీనగర్‌లో రూ.30 లక్షలతో జరుగుతున్న నిర్మాణ పనులను స్థానికులతో కలిసి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులు జరగాలన్నారు. అన్నికాలనీలల్లో ప్రధాన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు చేపటాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్‌లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మియాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోగల శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్‌లలో నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగనున్నాయి. రూ.3కోట్ల 12లక్షల అంచనాతో జరుగనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, గంగాధర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించనున్నారు. రాజీవ్ గృహకల్పలో రూ.40లక్షల వ్యయంలో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు, పాపిరెడ్డి కాలనీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, నెహ్రూ నగర్‌లో రూ.20లక్షలు, మసీద్‌బండలో రూ.63 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు, గచ్చిబౌలి డివిజన్ పరిధిలో గల టెలికాం నగర్‌లో రూ.33 లక్షలు, సాయి ఐశ్వర్య కాలనీలో రూ.50లక్షలు, మధురానగర్‌కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు అలాగే కొండాపూర్ డివిజన్ పరిధిలో గల విఠల్‌రావు నగర్‌లో రూ.32 లక్షలు, కావూరిహిల్స్‌లో రూ.34 లక్షల అంచనాతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపనలు జరుగనున్నాయి.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ విజేతగా జేఎన్‌టీయూ జట్టు


వర్సిటీ క్రీడాకారులతో వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్ తదితరులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఇంటర్ ఇంజనీరింగ్ హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్‌లో జేఎన్‌టీయూ పురుషుల జట్టు విజేతగా నిలిచింది. అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన టోర్నమెంట్‌లో పాల్గొని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న జేఎన్‌టీయూ టీమ్‌ను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి గురువారం అభినందించారు. అలాగే, శ్రీనిధి ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఖోఖో పోటీల్లోనూ ప్రథమ బహుమతి సాధించిన క్రీడాకారులను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొని జేఎన్‌టీయూకు మరిన్ని పతకాలు సాధించాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. యూనివర్సిటీ తరఫున క్రీడాకారులకు అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జపాన్ హబ్‌తో ఓక్సన్ వర్సిటీ ఎంఓయూ

- ఓక్సన్ యూనివర్సిటీలో జపనీస్ ల్యాంగేజ్ సెంటర్ ఏర్పాటు


ఎంఓయూ పత్రాలను మార్చుకుంటున్న ఓక్సన్, జపాన్ హబ్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఓక్సన్ విశ్వవిద్యాలయంతో జపాన్ హబ్, ఇండో బాక్స్ సంస్థలు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇరుదేశాల్లోని సాంస్కృతిక అధ్యయనంతో పాటు విద్యార్థులకు కెరీర్ డెవలప్‌మెంట్‌కు ఈ త్రైపాక్షిక ఎంఓయూ దోహద పడుతుందని ఆయా సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. ఓక్సన్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రౌల్ వి రోడ్రిగ్జ్ మాట్లాడుతూ.. ఎంఓయూ మేరకు తమ విశ్వవిద్యాలయంలో జపనీస్ భాషా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఈ కేంద్రం ద్వారా విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సాంస్కృతిక అవగాహనను పెంపొందించడానికి కోర్సులను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈభాగస్వామ్యంతో ఉమ్మడి పరిశోధన, ప్రాజెక్టులు, భాగస్వామ్యాలకు అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని పేర్కొన్నారు. జపాన్‌లో విద్యార్థుల మార్పిడి, ఇంటర్న్‌షిప్‌లు, ఉపాధి అవకాశాలు, కల్చరల్ లెర్నింగ్ అనుభవాలు సులువవుతాయన్నారు. జపనీస్ మేనేజ్‌మెంట్ పద్ధతులపై దృష్టిపెట్టడం వలన ఇక్కడి విద్యార్థుల్లో నైపుణ్యాలు మరింత మెరుగవుతాయన్నారు. విద్యాపరమైన సహకారాలతో పాటు సాంకేతిక పురోగతిని కూడా గణనీయంగా పెంచుతుందన్నారు.

ఔటర్ రింగురోడ్డుపై రెండు కార్లు ఢీ

- హిమాయత్‌సాగర్ వద్ద ఘటన

రాజేంద్రనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డు ఎమర్జెన్సీ లేన్‌లో ఆగి ఉన్న కారును వెనకాల నుంచి వచ్చిన మరో కారు ఢీకొట్టింది. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. హిమాయత్ సాగర్ ఔటర్ రింగ్‌రోడ్డు ఎమర్జెన్సీ లేన్‌లో ఎర్టిగా కారు(టీఎస్08 ఈజీ 2720) ఆగి ఉంది. కారులో ఇబ్బంది ఉంటే అక్కడ కారును ఆపారు. అదే సమయంలో గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వేగంగా వస్తున్న ల్యాండ్రోవర్ డిఫెండర్ కారు (టీఎస్ 09 జీబీ 6666) ఎర్టిగా కారును వెనకాల నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భెల్ టౌన్‌షిప్‌కు ఆర్టీసీ దూరం

- బీహెచ్‌ఈఎల్ పేరిట బస్‌డిపో.. అయినా కాలనీలోకి రాని బస్సులు
- అలంకార ప్రాయంగా 6 బస్టాండ్‌లు
- మూతపడ్డ బస్‌పాస్ కౌంటర్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు

పూర్తిగా నిలిచిన ప్రజారవాణా వ్యవస్థ



బస్సులతో నిండిన స్టాండ్ (ఫైల్)

భెల్ టౌన్‌షిప్‌కు ఆర్టీసీ స్వస్తి చెప్పింది. ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాలకు 100కు పైగా రాకపోకలు సాగించిన ఆర్టీసీ బస్సులను ఆపేసింది. తెలుగు రాష్ట్రాలకు ఇక్కడి నుంచి ప్రతీరోజు 100 బస్సులు, పండుగలప్పుడు అదనంగా దాదాపు 500 వరకు వెళ్లే బస్సుల రద్దీ.. ప్రయాణికుల సందడి నేడు కనుమరుగైంది. ఈ రూట్‌లో లక్ష జనాభా ఉన్నా.. 14 పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాల, ఒక డిగ్రీకళాశాల ఉన్నా ఆర్టీసీ ఎందుకో పట్టించుకోలేదు. బస్‌పాస్ కౌంటర్ మూసేసింది. దీంతో ఆరు బస్టాండ్లు అలంకార ప్రాయంగా మారాయి. నాలుగు దశాబ్దాలుగా భెల్ టౌన్‌షిప్ కాలనీ మీదుగా జరిగిన ఆర్టీసీ బస్సుల రాకపోకలు నేడు పూర్తిగా నిలిచిపోవడంపై, ప్రజారవాణా లేక వేలాది మంది ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు పడుతున్న తీవ్ర ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ఖేల్‌కాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజారవాణా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తూ, మారుమూల ప్రాంతాలకు సైతం రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్న ఆర్టీసీ లక్షలాది మంది ప్రయాణించే ప్రాంతాలను విస్మరించింది. ప్రజానీకానికి ఎప్పటికప్పుడు మెరుగైన వసతులు, రవాణా సౌకర్యాన్ని కల్పించేందుకు ఆయా విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాల్సిన ఉన్నా..కొందరితీరు అందుకు భిన్నంగా ఉంది. నగర శివారులో అతిపెద్ద కాలనీల్లో ఒకటిగా గుర్తింపు పొందిన వాటిలో బీహెచ్ ఈఎల్ టౌన్‌షిప్ ఒకటి. సంగారెడ్డి జల్లా సరిహద్దులో హైదరాబాద్ ముఖద్వారం వద్ద గల కాలనీకి ప్రతిరోజూ ఉదయం 5గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు 100కు పైగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించేవి. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ నుంచి కోఠి, దిల్‌సుఖ్‌నగర్, చార్మినార్, మేడ్చల్, మెహిదీపట్నంకు రోజూ బస్సుల రాకపోకలు సాగేవి. అలాగే నగరం నుంచి వచ్చే బస్సులు బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ నుంచి ఎల్‌ఐజీకాలనీ, రామచంద్రాపురం మీదుగా పటాన్‌చెరుకు వెళ్లేవి. కాగా టౌన్‌షిప్ నుంచి రోజూ వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులతోపాటు ప్రయాణికులు వివిధ పనులపై నగరానికి, వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు. నాలుగు దశాబ్దాలుగా కాలనీలో జరిగిన ఆర్టీసీ బస్సుల రాకపోకలు నేడు పూర్తిగా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

కరోనా సమయంలో..

కరోనా సమయంలో భెల్ టౌన్‌షిప్ కాలనీ రూట్ మీదుగా ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. కరోనా అనంతరం ఇక్కడి నుంచి శివారు ప్రాంతాలకు బస్సుల రాకపోకలను పునరుద్ధరించారు. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోకి కూడా ఆర్టీసీ బస్సుల రాకపోకలు జరిగాయి. అయితే రానురాను బస్సుల ట్రిప్పులను తగ్గించిన ఆర్టీసీ యాజమాన్యం నేడు ఈ రూట్‌లో పూర్తిగా నిలిపివేసింది. టౌన్‌షిప్‌తోపాటు శివారు కాలనీల ప్రజలు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎంఐజీ.. ఎల్‌ఐజీకాలనీ.. రామచంద్రాపురంపై తీవ్ర ప్రభావం

నగరంలోని వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు లింగంపల్లి మీదుగా బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ నుంచి ఎల్‌ఐజీ, రామచంద్రాపురం నుంచి పటాన్ చెరుకు వెళ్లేవి. దీంతో కేవలం టౌన్‌షిప్ వాసులేకాకుండా ఎల్‌ఐజీకాలనీ, రామచంద్రాపురంకు వెళ్లేవారికి సైతం రవాణా సౌకర్యం సౌలభ్యంగా ఉండేది. అయితే టౌన్‌షిప్‌కు బస్సులు రాకపోవడంతో ఆయా ప్రాంతాలపై తీవ్ర పభావం పడింది. బస్సుల రాకపోకలు నిలిచిపోవడంతో ఇక్కడి ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారి దోపిడీ మొదలైంది. ఎల్‌ఐజీకాలనీ, రామచంద్రాపురం వాసులు రవాణా సౌకర్యం లేక ఆటోల్లో లింగంపల్లి, అశోక్‌నగర్ వరకు వచ్చి ఆర్టీసీ బస్సులను ఎక్కుతున్నారు.

మూతపడ్డ బస్‌పాస్ కౌంటర్

ప్రతీ రోజు వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు కాలనీ నుంచి నగరానికి వెళ్లేవారు. ఇక్కడి డిమాండ్‌కు తగ్గట్టుగా ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్‌ను సైతం ఏర్పాటుచేసింది. దీంతో పాఠశాలలు, కాలేజీలకెళ్లే విద్యార్థులు ఇక్కడి కౌంటర్‌లో పాసులు తీసుకునేవారు. కాగా అట్టి సౌకర్యాన్ని సైతం ఆర్టీసీ తీసివేయడంతో నేడు పటాన్‌చెరు, లింగంపల్లిలో గల బస్‌పాస్ కౌంటర్లకు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ నెలకొన్న సమస్యలపై స్థానికులు పలుమార్లు నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు విన్నవించుకుంటున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

కనుమరుగైన జిల్లా బస్సులు

సంక్రాంతి, శివరాత్రి.. దసరా పండుగలు వచ్చాయంటే భెల్ టౌన్‌షిప్ కాలనీ ప్రయాణికులతో కిటకిటలాడేది. సువిశాలమైన ప్రాంగణం, వందల బస్సులను నిలుపుకునే వీలుండేది. దీంతో వివిధ జిల్లాకు వెళ్లే బస్సులతో ప్రధాన బస్టాండ్ సందడిగా ఉండేది. తెలుగు రాష్ట్రాలకు ఇక్కడ నుంచి ప్రతీరోజు 100 బస్సులు వెళ్లేవి. పండుగలప్పుడు అదనంగా దాదాపు 500 వరకు బస్సులు దూరప్రాంతాలకు వెళ్లేవి. అయితే భెల్ యాజమాన్యం బస్సుల రాకపోకలను ఆపేయడం, బస్సులను నిలిపే ప్రాంతాలను తొలగించడంతో వివిధ జిల్లాలకు వెళ్లే ప్రయాణికులు అశోక్‌నగర్, చందానగర్‌కు వెళ్లి జిల్లా బస్సులను ఎక్కుతున్నారు.

టౌన్‌షిప్‌కు తిరిగి బస్సులను ప్రారంభించాలి

బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ నుంచి బస్సుల రాకపోకలను తిరిగి ప్రారంభించాలని విద్యార్థులు, ఉద్యోగులు, కాలనీవాసులు కోరుతున్నారు. బస్‌పాస్ కౌంటర్‌ను తిరిగి తెరవడంతో పాటు జిల్లా బస్సులను సైతం ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీ రవాణా వ్యవస్థను పటిష్ఠంచేసి, శివారు ప్రాంతాలు, గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం కల్పిస్తుండగా నగరానికి కూతవేటు దూరంలో గల ప్రధాన కాలనీకి బస్సులను నడపకపోవంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ యాజమాన్యం బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌కు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

టౌన్‌షిప్‌లో ఆరు బస్టాండ్లు

టౌన్‌షిప్‌లో మొత్తం ఆరు బస్టాండ్లు ఉన్నాయి. జూనియర్ కాలేజీ, చర్చి, ఆస్పత్రి, టెంపుల్, ఎస్‌హెచ్4 బస్టాండ్లు, ఒకటి మేయిన్ బస్టాండ్ ఉన్నాయి. ఈ రూట్‌లో దాదాపు లక్ష జనాభా ఉంటుంది. ఈ రూట్‌లోనే ప్రభుత్వ ప్రైవేట్‌కు సంబంధినవి 14 పాఠశాలలు, ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఒక డిగ్రీకాలేజీ ఉన్నాయి. మొత్తం 18 వేల మంది వరకు విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు.


బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో గల ప్రధాన బస్టాండ్


జూనియర్ కాలేజీ బస్టాండ్


మూతపడ్డ బస్‌పాస్ కౌంటర్

ప్రభుత్వ రంగ సంస్థల మనుగడ ప్రశ్నార్థకం

- ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి


బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి

ఖేల్‌కాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, పారిశ్రామిక వ్యతిరేక విధానాల వల్ల నేడు దేశంలో ప్రభుత్వ రంగ సంస్థల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి పేర్కొన్నారు. టౌన్‌షిప్‌లో గల ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ సెక్టార్ పరిశ్రమలను ప్రైవేటీకరణకు కేంద్రం యత్నిస్తోందని, దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందని, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ జాతీయ స్థాయిలో అన్ని యూనిట్‌లు, పీఎస్‌యూలల్లో నిరసనలు చేపడుతామన్నారు. ఆర్‌సీ.పురం యూనిట్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు అన్నివిధాల కృషి చేస్తామన్నారు. 2027లో జరిగే వేతన సవరణలో కార్మికులకు న్యాయం జరగాలంటే ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమన్నారు. స్వార్థ నాయకుల వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, హక్కులు కోల్పోతున్నారని పేర్కొన్నారు. అనుభవం, అవగాహన ఉన్న నాయకుడితోనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. బీహెచ్‌ఈఎల్‌కు ఆర్డర్ల కొరత లేదని, ఉద్యోగభర్తీలు చేయాల్సి ఉందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత కార్మిక సంఘాలపై ఉందన్నారు. యూనియన్ అధ్యక్షుడు రెహమాన్ మాట్లాడుతూ కార్మికులు తమ సౌకర్యాలు కోల్పోతే వాటిని తిరిగి సాధించడం కష్టతరమన్నారు. సమస్యలను పరిష్కరించడంలో అధికార కార్మిక సంఘం పూర్తిగా విఫలమైందన్నారు. ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, క్యాంటీన్, టౌన్‌షిప్‌లో కార్మికులకు కనీస మౌలిక సదుపాయాలు కరువైయ్యాయని పేర్కొన్నారు. కార్మిక సమస్యలు కేవలం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమన్నారు. పరిశ్రమను కాపాడుకునే బాధ్యత ప్రతీ కార్మికుడిపై ఉందన్నారు. కార్మిక హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం సాగిస్తామని, యూనిట్‌కి మరిన్ని ఆర్డర్లు వచ్చేలా కార్పొరేట్ యాజమాన్యంపై ఒత్తిడి తెస్తామన్నారు. అనంతరం ఐఎన్‌టీయూసీ యూత్ విభాగం జాతీయ ఉపాధ్యక్షుడు సత్యజిత్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి స్వామి అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు కొండారెడ్డి, వలీఉద్దీన్, శ్రీరాములు నాయక్, మహిపాల్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీధర్ తదితరులతో పాటు వివిధ సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.



పాల్గొన్న కార్మికులు, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

నేటి నుంచి విజయదుర్గాదేవి ఆలయ బ్రహ్మోత్సవాలు


శ్రీ విజయదుర్గాదేవి అమ్మవారు

మియాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మియాపూర్‌లో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీధర్మపురి క్షేత్రంలోని విజయదుర్గాదేవి అమ్మవారి ఆలయం 38వ వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. నిత్యపూజలు, అభిషేకాలతో దేదీప్యమానంగా విరాజిల్లుతున్న అమ్మవారి ఆలయంలో శుక్రవారం (నేటి) నుంచి ఈనెల 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. శుక్రవారం ఉదయం మంగళవాయిద్యాలతో నిత్య విశేష పూజలు, అభిషేకాలు, ధ్వజారోహణం, అమ్మవారికి మంగళస్నానం, అలంకరణ, విశేష హోమం నిర్వహిస్తారు. సాయంత్రం సహస్రనామార్చన, పల్లకిసేవ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 14వ తేదీ (శనివారం) ఉదయం శ్రీచక్ర అభిషేకం, అలంకరణ, వరి కంకులతో సహస్ర నామార్చన, విశేష హోమం, నీరాజన మంత్రపుష్పం, సాయంత్రం ప్రముఖ హరికథా భాగవతారిణి జయంతి సావిత్రిచే దుర్గా మహత్మ్యం హరికథా గానామృతం, పల్లకి సేవ, పవళింపు సేవ తదితర పూజలు జరుగుతాయి. 15వ తేదీ (ఆదివారం) ఉదయం నిత్యపూజలు, అభిషేకాలు, ప్రముఖ అధ్యాత్మికవేత్త డాక్టర్ అనంతలక్ష్మిచే సందేశం, సాయంత్రం నవావరణ పూజ, జ్యోతిర్మయి ఆత్మలింగేశ్వరుల దివ్య కల్యాణం, శాంతి మంత్రాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.

అంజన్న ఆలయంలో నిత్యపూజలు

ఖేల్‌కాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో గల శ్రీ వెంకటేశ్వర- యోగేశ్వర స్వామి దేవస్థానంలో గల ఆంజనేయస్వామి అంతరాలయంలో శుక్రవారం హనుమత్ వ్రతం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటలకు స్వామికి నిత్యపూజలతో పాటు విశేష పంచామృతాభిషేకం, అర్చనలు, సాయంత్రం 6గంటల నుండి 11 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు జరుగుతాయని, కాలనీవాసులు పాల్గొనాలని కోరారు.

గీతం పూర్వ విద్యార్థికి అరుదైన గౌరవం

- ప్రపంచ సదస్సులో వక్తగా, న్యాయనిర్ణేతగా అవకాశం
- గ్లోబల్ ఐకాన్ అవార్డుతో సత్కారం


గ్లోబల్ ఐకాన్ అవార్డుతో అనూజ్ సురావ్

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ పూర్వ విద్యార్థి, ప్రస్తుతం అమెజాన్ రోబోటిక్స్‌లో సిస్టమ్స్ డెవలప్ మెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అనూజ్ సురావ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు అమెరికా, కేంబ్రిడ్జ్‌లోని హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ పరిశోధనా సదస్సు (గ్లోబల్ రీసెర్చ్ కాన్ఫరెన్స్ 2024లో వక్తగా, న్యాయనిర్ణేతగా)లో పాల్గొన్నారు. బెంగళూరుకు చెందిన గ్లోబల్ ఎకనామిక్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ హరికృష్ణ మారం నేతృత్వంలో జరిగిన ఈ సదస్సులో రోబోటిక్స్ క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ రంగాలకు అనూజ్ చేసిన సేవలను గుర్తిస్తూ 'గ్లోబల్ ఐకాన్ అవార్డు'తో సత్కరించారు. అమెరికా అంకుర సంస్థల నిపుణుడు, వక్త, మార్గదర్శి, వ్యవస్థాపకుడు బారన్ అలెక్ స్టైరన్ చేతుల మీదుగా ఈసత్కారాన్ని అందుకోవడం విశేషం. 'అడాప్టివ్ ఇంటర్ ఫేస్‌తో ఏడబ్ల్యూఎస్ క్లౌడ్, కృత్రిమ మేధ ఆధారిత ఆటోమేటెడ్ రోబోటిక్ సిస్టమ్‌'పై అనూజ్ సంచలనాత్మక పరిశోధనా పత్రం సమర్పించారు. తన పరిశోధనాంశాలను అక్కడ ప్రదర్శించడం, వినూత్న పరిశోధనా పత్రాల ఎంపికలో న్యాయనిర్ణేతగా వ్యవహరించా రు. అత్యాధునిక కృత్రిమ మేధస్సు, అడాప్టివ్ ఇం టర్ ఫేస్‌ల ఏకీకరణను ప్రస్ఫుటించేలా అనూజ్ అధునాతన రోబోటిక్ సిస్టమ్‌ను చూసేందుకు సదస్సుకు హాజరైన వారికి వీలుకల్పించారు. సం కల్ప్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సామాజిక సేవ, అనాథలను ఆదుకోవడంతో పాటు గీతం విద్యార్థిగా ప్రఖ్యాత ఐటీసీ సంస్థ నుంచి పర్యావరణ పరిరక్షణకు గాను నేషనల్ గ్రీన్ లీడర్ అవార్డును అనూజ్ అందుకున్నారు. తర్వాత న్యూయార్క్ విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఎంఎస్ చేసి, అమెరికాలోనే స్థిరపడ్డారు. ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో గుర్తింపు తెచ్చుకున్న అనూజ్ గీతంలోని ఉన్నత విద్య, విలువల నాణ్యతకు నిదర్శనంగా నిలిచారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి


ప్రసంగిస్తున్న ఏసీపీ కృష్ణప్రసాద్

చందానగర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని ఏసీపీ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గురువారం చందానగర్ డివిజన్‌లో గల పీజేఆర్ స్టేడియంలో సన్‌షైన్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో ఖేల్ మహోత్సవ్2024 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు మానవ విలువలు, దేశచరిత్ర, త్యాగమూర్తుల ఘన చరిత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నతనం నుంచే మంచి అలవాట్లు కలిగి ఉంటే ఉత్తమ భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ వీరేశంగౌడ్, హోప్ ఫౌండేషన్ ఛైర్మన్ కొండా విజయ్, యువజన నాయకులు అభిషేక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఖేల్ మహోత్సవ్ సందర్భంగా విద్యార్థులు చేసిన పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు, ఆటలు ఆకట్టుకున్నాయి.


సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు